# దృక్పథం

-సన్హిత్ ఎల్యేవి

శ్రీనివాస్ నా కొలీగ్. ఒకరకంగా నాకు సబార్డినేట్. మా ఇద్దరిదీ ఇంచుమించు ఒకటే వయసు కాబట్టి మామధ్య స్నేహం బాగా డెవలప్ అయింది. అయితే అతడు నాలా ప్రభుత్వోద్యోగి కాదు. కాంట్రాక్ట్ ఉద్యోగి. అయిదేళ్ళ నుండి మా దగ్గరే పని చేస్తున్నాడు.

ఉదయం పదిగంటలకు ఆఫీసుకు వెళ్లగానే కంప్యూటర్ ఆన్‌చేసి నాక్కావాల్సిన ఫైలు ఓపెన్ చేసి చూసుకుంటుండగా వచ్చాడు శ్రీనివాస్.

"గుడ్‌మార్నింగ్ సంజా" అంటూ విష్ చేసాడు.

"గుడ్‌మార్నింగ్" అంటూ అతడివైపుచూసాను. నుదుటిమీద ఎర్రటి బొట్టు, చెవిలో పువ్వు, నెత్తిమీద అక్కడక్కడ అక్షింతలు. ఇదీ అతడి అవతారం. ఆశ్చర్య పోయాను.

"ఏంటి శ్రీనివాస్! ఏదైనా గుడికి వెళ్లావా?" అడిగాను.

"అవును సంజా. విఘ్నేశ్వరుడి గుడికి వెళ్లాను. ప్రతిరోజూ ఏదో ఒక గుడికి వెళ్లి ఆఫీసుకొస్తుంటాను. నీకీ విషయం తెలీదా?"

"ఆహా! అలాగా. నేనెప్పుడూ గమనించలేదు" అని చెప్పి ఆలోచనలో పడ్డాను. శ్రీనివాస్‌ది భక్తికాదు, మూఢభక్తి. అలాగని నాకు దైవం మీద నమ్మకంలేదని కాదు. అప్పుడప్పుడూ గుడికి వెళ్తుంటాను. కానీ మరీ ఇంత అతికాదు.

"సార్! మిమ్మల్ని పెద్ద బాస్ రమ్మంటున్నారు" అని ప్యూన్ వచ్చి చెప్పడంతో బాస్ కాబిన్‌వైపు వెళ్లాను.

***

"హలో!" ఫోన్లో శ్రీనివాస్ గొంతు.

"మాట్లాడుతున్నాను చెప్పు" అన్నాను.

"ఏం లేదు సంజా. నేను నా ఫేమిలీతో తిరుపతి వెళుతున్నాను. రెండ్రోజులు తరువాత ఆఫీసుకొస్తాను. ఈ విషయం మన బాస్‌కి ఇన్‌ఫార్మ్ చేయి" ఎగ్జైటింగ్గా అన్నాడు.

"అలాగే. తప్పకుండా చెప్తాను. హేపీ జర్నీ" అని చెప్పి నవ్వుకున్నాను.

ఆరునెలల క్రితమే అతడు తిరుపతి వెళ్లాడు. మళ్లీ ఇప్పుడు వెళుతున్నాడు.

సంవత్సరంలో కనీసం రెండుసార్లయినా తిరుపతికి వెళ్లడం అతడి అలవాటు. అంత పెద్ద క్యూలో నిలబడి గంటల తరబడి వెయిట్ చేసి దేవుడిని దర్శించడంలో అతడు పొందే ఆనందం వింతకాదు.

రెండురోజుల తరువాత శ్రీనివాస్ రానే వచ్చాడు. నున్నటి గుండుతో, నుదుటి మీద నిలువు బొట్టుతో, విపరీతమైన సంతృప్తితో అతడి మొహం వెలిగిపోతోంది.

"ప్రసాదం తీసుకోండి సార్" అంటూ అందరికీ ప్రసాదాన్ని పంచుతున్నాడు. ఆ కార్యక్రమం అంతా పూర్తయ్యాక నా దగ్గరకొచ్చాడు.

"ఏంటి శ్రీనివాస్! దర్శనం బాగా జరిగిందా?" క్యాజువల్‌గా అడిగాను.

"చాలా బాగా జరిగింది సంజా. ఈసారి వెంకన్నబాబుని మరింత దగ్గరగా చూసాను" అంటూ తన బేగ్‌లోనుండి రెండు సిడిలను బయటకుతీసాడు. అవి డివోషనల్ సాంగ్స్ ఉన్న కాంపాక్ట్ డిస్క్‌లు. ఆ రెండు సిడిల్లోని పాటలను మా కంప్యూటర్‌లో డంప్ చేసి వాటిని ప్లే చేసి నాకు వినిపించాడు. "సరే శ్రీనివాస్. అవన్నీ తరువాత చూసుకోవచ్చు. ముందు పని కానీయ్" అని రెండురోజులుగా పెండింగ్‌లో వున్న పనిని అతడికి అప్పగించాను. ఏమనుకున్నాడో ఏమో వెంటనే పనిలో లీనమయ్యాడు.

***

ఆఫీసంతా ఒకటే హడావుడి. దానిక్కారణం మా కొలీగ్స్ చాలామందికి వచ్చిన ప్రమోషన్స్. ప్రమోటీస్ అంతా కలిసి ఈ రోజు సాయంత్రం పార్టీ ఇస్తున్నారు. పార్టీ 'అంటే మామూలు పార్టీ కాదు. మందు పార్టీ. మాలాంటి మందుబాబులకి పసందైన పార్టీ.

చిన్నసైజు మీటింగ్‌లాంటిది పెట్టి ప్రమోటీస్ అందరినీ మా బాస్ అభినందించగానే మా కొలీగ్స్ అంతా ఎవరికి నచ్చిన స్టాల్‌వైపు వాళ్ళు విడిపోయారు. మేమంతా డ్రింక్స్ వైపు వెళ్లాం.

శ్రీనివాస్ ఒక మూల నిలబడి డిస్పోజబుల్ గ్లాసులో థమ్సప్‌ని అమృతంలా నెమ్మదిగా సేవిస్తున్నాడు. ఎందుకో అతణ్ని ఏడిపించాలనిపించింది.

"శ్రీనివాస్! ఎందుకంత దూరం. ఇలారా" అని పిలిచాను. అతడు మా గుంపులోకొచ్చాడు.

"శ్రీనివాస్! ఇంత వయసొచ్చింది. ఇంకా థమ్సప్ తాగడం ఏంటి? మందు పుచ్చుకో" జోక్‌గా అడిగాను.


"వద్దు సంజా. నాకు అలవాటులేదు."

"ఏం మందుకొడితే దేవుడు తిడతాడా? లేక శపిస్తాడా?" జోక్ చేసాను.

అందరూ పగలబడి నవ్వసాగారు. అతడి మొహం చిన్నబోయింది.

శ్రీనివాస్ మొదట చిన్నగా నవ్వాడు. తరువాత బిగ్గరగా నవ్వసాగాడు. అతడి ప్రవర్తనకి చుట్టూ అందరూ సైలెంట్ అయి ఆసక్తిగా చూస్తున్నారు. అప్పుడు చెప్పడం ప్రారంభించాడు.

"సంజా! మనిద్దరి మధ్యా ఐదేళ్ళ స్నేహం ఉన్నా నీవు నన్ను అర్థం చేసుకోకపోవడం నా దురదృష్టం. నువ్వన్నట్లు నాకు స్థిరమైన ఉద్యోగంలేదు, మంచి లైఫ్ స్టైల్ లేదు. ఒప్పుకుంటాను. భక్తి అన్నది నా వీక్‌నెస్సో, మూర్ఖత్వమో కావచ్చు.



కానీ నాకు అది ఎనలేని ఆనందాన్ని, ప్రశాంతతని, సంతృప్తినీ ఇస్తోంది. ఇన్ని సమస్యల మధ్య, ఇన్ని బాధల మధ్య కూడా ఇంత డిటాచ్డ్‌గా నేను ఉండగలుగుతున్నానంటే అదంతా నా ఈ మనస్తత్వం వలనే కదా. నీకు మంచి ఉద్యోగం ఉంది, స్థిరత్వం వుంది. అన్నీ ఉన్నాయి. కానీ నీ జీవితం నిజంగానే సంపూర్ణ ఆనందమయం అని ఒప్పుకోగలవా? ఒప్పుకోలేవు. దైనందిన సమస్యలని మర్చిపోవడానికి నువ్వు మందు మీద ఆధారపడ్డావు. నేను దేవుడిమీద ఆధారపడ్డాను. అంతే తేడా! జీవితంపట్ల నీ దృక్పథం వేరు, నా దృక్పథం వేరు. దానివలన నాకు నష్టం కలగనంతవరకూ నేనిలాగే ఉంటాను. నీకేమైనా అభ్యంతరమా?" నవ్వుతూ చెప్పాడు.

లాగిపెట్టి ఎవరో కొట్టినట్లనిపించింది నాకు. తాగిన మత్తు దిగిపోయింది.

★